క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

మదనపల్లె సిటీ : మదనపల్లె ఆర్టీసీ సిబ్బందికి శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ 2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. ఉదయం 9 నుంచి 2 వరకు ప్రముఖ వైద్యులు సిబ్బందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని ఆర్టీసీ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఆనంద్

వాల్మీకిపురం: వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టు ఆవరణంలో గురువారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాద సంఘం ఎన్నికలను నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఆనంద్ కుమార్, కార్యదర్శిగా రమణ గెలుపొంది, బాధ్యతలు స్వీకరించినట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన కరీముల్లా బేగ్ తెలిపారు. అలాగే ఉపాధ్యక్షుడిగా విజయ్ భాస్కర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా మూర్తయ్య, ఈసీ సభ్యులుగా రవి ప్రకాష్, ప్రభాకర్ రెడ్డి, చంద్రశేఖర్, రెడ్డెప్ప, రమణారెడ్డి తదితరులు ఎంపికయ్యారని తెలిపారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

వాల్మీకిపురం : మండలంలోని చింతపర్తి ఇందిరమ్మ కాలనీలో శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్ తెలిపారు. పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకొని, పరిష్కరిస్తారని తెలిపారు. అలాగే ఉదయం 11గంటలకు స్థానిక వెలుగు కార్యాలయంలో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉందని ఏపీఎం నరసింహులు తెలిపారు.

కలకడ : మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ శ్రీదేవి, ఎంపీడీఓ నారాయణ తెలిపారు. గురువారం మండలంలోని కె.బాటవారిపల్లె సచివాలయంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమావేశం నిర్వహించి ప్రసంగించారు. శుక్రవారం, శనివారాలలో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కె.బాటవారిపల్లె పంచాయతీలోని ప్రతి గడపకు హాజరై ప్రజా సమస్యలు తెలుసుకుంటారన్నారు.

నేడు కలెక్టరేట్ ముట్టడి

బి.కొత్తకోట : ఎస్సీల వర్గీకరణకు బీజేపీ మాటిచ్చి మోసం చేసిందని, దీనికి నిరసనగా శుక్రవారం జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మహాజన సోషలిస్టు పార్టీ తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్ దుమ్ము చిన్నా తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీ నమ్మకద్రోహానికి నిరసన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

నీటి సౌకర్యం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని రంగసముద్రం జగనన్న కాలనీలో కొత్తగా డ్రిల్లింగ్ చేసిన బోరు ద్వారా జలాలు పుష్కలంగా ఎగసి పడ్డాయి. పక్కా గృహాలు మంజూరైన లబ్ధిదారుల సౌకర్యార్థం అధికారులు నీటి సౌకర్యం కల్పించారు. బోరుకు మోటారు అమర్చిన అనంతరం సర్పంచ్ జగదీశ్వర్‌రెడ్డి, ఉప సర్పంచ్ బొక్కసం శివప్రసాద్, ఎంపీటీసీ సుజాత, సుబ్రమణ్యం బోరు మోటారు ప్రారంభించారు.

కొటేషన్లు ఆహ్వానం

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మకొండ ఆలయంలో ప్రసాదం తయారీ వస్తువులు, పూజా సామాగ్రి సరఫరా చేసేందుకు ఆసక్తిగల దుకాణదారులు కొటేషన్లు ఇవ్వాలని ఆలయ కమిటీ ఛైర్మన్ నరసింహారెడ్డి, ఈఓ మంజుల అన్నారు. గరువారం స్థానిక దేవాలయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఏడాది పాటు కాంట్రాక్టు కలిగిన అమ్మవారి ప్రసాదం తయారీ, అమ్మవారికి నిత్యం అవసరమయ్యే పూజాసామాగ్రిని సరఫరా చేసేందుకు తగిన అంచానా వేస్తూ దుకాణదారులు కొటేషన్లు ఇచ్చుకోవాలన్నారు. వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని అన్నారు.

ఆకట్టుకున్న బలిబండ్లు



బలిబండిపై భీముడి వేషధారణలో వ్యక్తి

కలకడ : మహాభారతయజ్ఞంలో భాగంగా గురువారం ఏర్పాటు చేసిన బలిబండ్లు కార్యక్రమం ఆకట్టుకున్నాయి. కలకడ పురవీధులలో ట్రాక్టర్ పై భీముని వేషధారణలోని కళాకారులకు భక్తులు పిండిపదార్థాలను భక్తి శ్రద్ధలతో అందజేశారు. అనంతరం భారత మిట్టపైకి చేరుకోగానే భక్తులకు భీముడు ప్రసాదం పంపిణీ చేశారు. తదనంతరం బకాసురవధ కార్యక్రమం, పాటలు భక్తులను ఆకట్టుకున్నాయి.

సాహితీకారుల చిత్రాలు బహూకరణ

మదనపల్లె సిటీ : సాహితీఅభిమాని ఎం.ఎస్. బాషా గురువారం విద్యోదయ పాఠశాలకు సాహితీకారుల చిత్రాలు ఉచితంగా అందజేశారు. ప్రముఖ సాహితీవేత్తల పోటోలను పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసులుకు అందించారు. ప్రజా చైతన్య స్రవంతి అధ్యక్షులు గొల్లపూడి తిరుపతిరావు, నవలా రచయిత టీఎస్‌ఏ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అంతా రామమయం

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణంలో గురువారం శ్రీరామనవమి ఉత్సవాలు స్థానిక సొసైటీకాలనీ కోదండరామస్వామి ఆలయంలో వేడుకగా నిర్వహించారు. స్థానిక అమినేనివీధిలోని రామాలయంలో అర్చకులు రమేష్ ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. స్థానిక బీటీ కాలేజీ మైదానం వద్దనున్న వరాల ఆంజనేయస్వామి ఆలయంలో సాయంత్రం సీతారాముల కళ్యాణం నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్డీవో ఎం.ఎస్.మురళి దంపతులు హాజరయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. స్థానిక అయోధ్యనగర్‌లోని రామాలయం, మేదరవీధిలోని పిండాల ఆంజనేయస్వామి, అప్పారావువీధిలోని ఘటికాచల ఆంజనేయస్వామి, కురవంకలోని శ్రీరామాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రాగిమానుసర్కిల్‌లో వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం నిర్వహించారు.



గుర్రంకొండ : సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు



మదనపల్లె సిటీ: ప్రత్యేక అలంకరణలో ఉత్సవ విగ్రహాలు

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

స్థానిక సొసైటీకాలనీలో శ్రీరామనవమి ఉత్సవాల్లో ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా పాల్గొన్నారు. ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారావు, సిద్దయ్యలు స్వాగతం పలికారు. కుమారపురంలో రామాలయం, రింగ్‌లోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయాల్లో జరిగిన పూజల్లో ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా పాల్గొన్నారు.

ప్రధాన కూడళ్లో పానకం, వడపప్పు పంపిణీ

మదనపల్లె పట్టణంలోని రాగిమాను సర్కిల్, నిమ్మనపల్లె క్రాస్, చిత్తూరు బస్టాండు, బెంగుళూరు బస్టాండు, ఆర్టీసీ బస్టాండు సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, నీరుగట్టువారిపల్లె ప్రాంతాల్లో వాల్మీకి సంఘ నాయకులు, వాసవీక్లబ్ సభ్యులు, యువకులు భక్తులకు పానకం, వడపప్పు పంపిణీ చేశారు.

బి.కొత్తకోట: శ్రీరామనవమి సందర్భంగా గురువారం బి.కొత్తకోటలో సీతారాముల కళ్యాణోత్సవ వేడుకలు, రథోత్సవాలు వైభవంగా జరిగాయి. స్థానిక పోకనాటివీధిలో వెలసిన కోదండరామాలయం, ఆర్యవైశ్య వీధిలో సీతారాముల ఉత్సవ మూర్తులకు కళ్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం పట్టణంలో పోకనాటివీధి, ఆర్యవైశ్య బజార్ నుంచి రెండు రథోత్సవాలు వేర్వేరుగా పురవీధుల్లో ఊరేగాయి.

కేవీపల్లె : కేవీపల్లెలో, ఎంపీపల్లె పంచాయతీ శ్రీనాథపురం కాలనీలో శ్రీ సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం సీతారాముల ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు.



మదనపల్లె సిటీ : పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా

పీలేరు : పీలేరు పట్టణం సదుం మార్గంలోని శ్రీ కల్యాణ సీతారామ స్వామి దేవస్థానం, స్థానిక ప్రకాశం రోడ్డు రామాలయం తోపాటు మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామ నవమి ఘనంగా నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సీతారాముల కల్యాణం వేడుకగా చేపట్టారు. పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేపట్టారు.

తంబళ్లపల్లె: తంబళ్లపల్లె రామాలయంలో శ్రీనివాస శర్మ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శేషసాయి ఆలయంలో వేదపండితులు స్కందమూర్తిశర్మ, రాఘవేంద్రస్వాములు సీతారాముల కళ్యాణాన్ని నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు సుధాకర్, వెంకటేష్‌లు భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

కలికిరి: కలికిరి రెడ్డివారిపల్లిలో శ్రీరామాలయంలో శ్రీసీతారాముల కళ్యాణోత్సవం నిర్వహించారు. పట్టణ పరిధిలోని క్రాస్ రోడ్డు, రామాలయం వీధిలోని ఆలయాల్లో స్వామివార్ల కళ్యాణోత్సవం, రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. మర్రికుంటపల్లి గ్రామం భయ్యారెడ్డిగారిపల్లిలో సాయంత్రం సీతారాముల కళ్యాణం చేపట్టారు.

కలకడ : మండలంలోని అన్ని గ్రామాలలో రామాలయాలను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిపించి గ్రామ పురవీధులలో ఊరేగించారు.



పీలేరు : శ్రీ కల్యాణ సీతారామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని సంపతికోట పంచాయతీ ముంతపోగులవారిపల్లిలో శ్రీ సీతా, రాములవారి రథోత్సవ వేడుకలు కన్నుల పండుగగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రథాన్ని లాగారు.

గుర్రంకొండ : గుర్రంకొండలోని కొత్తపేట, బలిజగడ్డ వీధుల్లో ఉన్న శ్రీ కోదండ రామస్వామి ఆలయాల్లో స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివార్లను మేళతాళాలతో, పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చుతూ గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు.

రామసముద్రం : రామసముద్రం మండలంలోని శ్రీరామాలయంలో వైభవంగా వేడుకలు నిర్వహించారు. ఆర్.నడింపల్లి, జంగాలపల్లి, కమ్మవారిపల్లి పంచాయతీ, ఎర్రబోయినపల్లిలో వెలసిన శ్రీకోదండరామస్వామి, రామసముద్రంలో వెలసిన వీరాంజనేయస్వామి ఆలయాల్లో నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులకు పానకం, వడపప్పు పంచిపెట్టారు. జంగాలపల్లి, ఎర్రబోయినపల్లి, రామసముద్రంలో సీతారాముల కళ్యాణోత్సవం కనులవిందుగా చేశారు.

కురబలకోట: మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. పోరెడ్డివారిపల్లె, కమతంవారిపల్లె, మొలకవారిపల్లెలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. చాందినీ బండ్లు ఆకట్టుకున్నాయి.



పెద్దతిప్పసముద్రం: రథోత్సవంలో భక్తులకు దర్శనమిస్తున్న ఉత్సవ మూర్తులు

■ కురబలకోటలో శ్రీ కోదండ రామస్వాముల వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం ధ్వజారోహణం నిర్వహించారు. శుక్రవారం సింహ వాహనం, ఏప్రిల్ 4న కళ్యాణోత్సవం, అదే రోజు గరుడోత్సవం, 5న రథోత్సవం జరుగుతుందని ఆలయ ధర్మకర్త కెబి లక్ష్మణ రావు, ఈఓ టి. మంజుల తెలిపారు.



పీలేరు : కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



తంబళ్లపల్లె : సీతారాముల కళ్యాణాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు



బి.కొత్తకోట: ఆర్యవైశ బజార్‌లో కళ్యాణోత్సవ వేడుక



కలికిరి: రెడ్డివారిపల్లిలో సీతారాముల కల్యాణం తిలకిస్తున్న భక్తులు

ఒంటిమిట్ట సీతారాముల కల్యాణానికి ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఒంటిమిట్టలో కన్నుల పండువగా నిర్వహించే సీతారాముల కళ్యాణం మహోత్సవానికి హాజరయ్యే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. ఏప్రిల్ 5న జరిగే కళ్యాణమహోత్సవానికి మదనపల్లె 2 డిపో నుంచి ప్రత్యేక ఆల్ట్రా డీలక్స్ బస్సు సర్వీసులు నడపనున్నట్లు డీఎం ఆర్‌సి నిరంజన్ తెలిపారు. 5న మధ్యాహ్నం 3 గంటలకు డిపో నుంచి బస్సులు బయలుదేరుతాయన్నారు. మొదట దేవుని కడపలో వెలసిన శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని తరువాత ఒంటిమిట్టకు వెళుతుందన్నారు. రానుపోను ఛార్జి రూ.500 చెల్లించాలన్నారు.

40 మంది ఉంటే ప్రత్యేక బస్సు..

ఏదైనా గ్రామం నుంచి 40 మందికి మించి ఒంటిమిట్ట వెళ్లాలనుకునే భక్తులు ఉంటే వారి గ్రామం నుంచే నేరుగా స్పెషల్ బస్సును ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.

ముందే బుక్ చేసుకోవచ్చు..

ప్రత్యేక సర్వీసులకు డబ్ల్యు డబ్ల్యు డబ్ల్యు .ఏపీఎస్‌ఆర్టీసీ ఆన్‌లైన్.ఇన్ అనే వెబ్ పోర్టల్లో ముందుగా సీట్లను రిజర్వేషన్ చేయించుకునే సౌకర్యం కూడా అధికారులు కల్పిస్తున్నారు. మదనపల్లె టు డిపో రిజర్వేషన్ కౌంటర్‌లో కూడా టిక్కెట్లు లభ్యమయ్యేలా ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. వివరాలకు డీఎం 9959225677, ఎఎం(టీ) 9160186645 నంబర్లను సంప్రదించాలని డీఎం సూచించారు.

చౌడేశ్వరి ఆలయాలు నిర్మించాలి

కలకడ : రాష్ట్రంలో తొగట వీరక్షత్రియులు ఉన్న ప్రతి గ్రామంలో శ్రీచౌడేశ్వరిదేవి ఆలయం నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర తొగట వీర క్షత్రియ సంఘం అధ్యక్షుడు మోడెం వీరాంజనేయప్రసాద్ అన్నారు. గురువారం కలకడ చౌడేశ్వరిదేవికి ఆసంఘం జిల్లా ఉపాధ్యక్షులు రామిశెట్టి రత్నమయ్య వితరణ చేసిన పట్టువస్త్రాలను ఆలయ పూజారి ఓబులేశుకు అందజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణంలో 25 శాతం మంది వృద్దులు, 25శాతం మంది యువత ఉండాలని, అవకాశం ఉన్న చోట ఆలయ అభివృద్ధి, నిత్య పూజలు నిర్వహించి కొనసాగించడానికి కళ్యాణ మండపాలు నిర్మాణం చేపట్టాలని సూచించారు. కలకడలోని శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి రూ.5 లక్షలు, కళ్యాణ మండపం నిర్మాణం కోసం రూ.10 లక్షలు తన వంతు సహాయంగా అందజేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా వంద ఆలయాలు, మరో వంద కళ్యాణ మండపాలు నిర్మించడమే ధ్యేయంగా ఉన్నట్లు తెలిపారు. నందవరంలో ప్రతి ఏడాది నిర్వహించే ఉత్సవాలకు పట్టువస్త్రాలు సమర్పించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి విన్నవించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చిట్టెం రామచంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు రత్నమయ్య, కార్యవర్గసభ్యులు రాజేంద్ర, లాయర్ రవిప్రకాష్, జీపుల క్రిష్ణ జయరాం, రామ్మోహన్, శ్రీనాథ్, రెడ్డెప్ప, శ్రీనివాసులు, రామక్రిష్ణ, ప్రసాద్, హరి, తదితరులు పాల్గొన్నారు.



చౌడేశ్వరిదేవి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న వీరాంజనేయప్రసాద్, తదితరులు

రణభేరి మహాసభను విజయవంతం చేయండి

కలకడ : రాజ్యాంగ రక్షణ రణభేరి మహాసభలో అధికసంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని వీసీకే పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి పాలకుంట శ్రీనివాసులు పిలుపు నిచ్చారు. గురువారం కలకడలో బాస్ నాయకులతో కలసి కరపత్రాలు ఆవిష్కరించి, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్నట్లు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ ప్రకటించడం దారుణమన్నారు. భారత రాజ్యాంగాన్ని సైతం మార్పు చేయాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వం ఆటలు సాగవన్నారు. ఈ కార్యక్రమంలో పాలకుంట చౌడప్ప, రామాంజులు, సాయికుమార్, కిషోర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాబు జైలుకు వెళ్లడం ఖాయం

ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : యువతకు నైపుణ్యాభివృద్ధి (ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్) కల్పించే ముసుగులో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.371 కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని, దేశచరిత్రలో నిరుద్యోగులను మోసం చేసిన అతి పెద్ద స్కామ్ ఇదేనని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్ జైలుకు వెళ్లడం ఖాయమని వ్యాఖ్యానించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర విభజనకు ముందు హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటయ్యాయని, ఆయా పరిశ్రమల్లో పనిచేసేందుకు యువతకు అవసరమైన నైపుణ్యాన్ని కల్పించనున్నామని అప్పటి సీఎం చంద్రబాబు మాయ మాటలు చెప్పి సీమెన్స్ అనే సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రకటించారన్నారు. ఇందుకోసం 6 క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నట్లు, ఒకో క్లస్టర్‌కు రూ.560 కోట్ల చొప్పున సుమారు రూ. 3,300 కోట్లు ఖర్చుచేయనున్నామని చంద్రబాబు ప్రకటించారన్నారు. ఇందులో 10 శాతం అంటే సుమారు రూ. 370 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం భరిస్తే మిగిలిన 90శాతం మొత్తాన్ని సీమెన్స్ సంస్థ ఏర్పాటు చేస్తుందని చంద్రబాబు క్యాబినెట్లో ప్రకటించి స్కామ్‌ను ముందుకు తీసుకెళ్లారన్నారు. ఈ కుంభకోణంలో రూ.371 కోట్లను చంద్రబాబు తన జేబులో వేసుకున్నారన్నారు. మదనపల్లె నియోజకవర్గంలో యువగళం పాదయాత్రలో నారాలోకేష్, ఇతర టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీపై పసలేని ఆరోపణలు చేశారని, వారు చేసిన వాటికి ఆధారాలతో సహా వస్తే అఖిలపక్ష నాయకులతో కలిసి బహిరంగ చర్చకు సిద్ధమని ఎమ్మెల్యే సవాల్ విసిరారు. పట్టణంలో భూకబ్జాలు, అవినీతి, అక్రమాలకు పాల్పడిన నాయకుల చరిత్ర ప్రజలందరికీ తెలుసని, ప్రతిపక్షనాయకులకు దమ్ముంటే వారు చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపాలన్నారు. సమావేశంలో ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీం అస్లాం, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజా రెడ్డి, వైస్‌చైర్మన్‌లు జింకా చలపతి, నూర్‌ఆజం, ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ ఆనంద పార్థసారధి, వెలుగు చంద్ర, సర్పంచ్‌లు దండు కరుణాకర్ రెడ్డి, బోర్‌వెల్ మహేష్, ఈశ్వరయ్య, వెంకటరమణ, వైస్ ఎంపీపీ నందినితాజ్, డిష్ రమణ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా, వైఎస్సార్ సీపీ నాయకులు

తాళం వేసిన ఇంట్లో చోరీ

మదనపల్లె : తాళం వేసిన ఇంట్లో బంగారునగలు, వెండిసామగ్రిని అపహరించుకుని వెళ్లిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పట్టణంలోని నీరుగట్టువారిపల్లె కప్పలవారివీధికి చెందిన నాగరాజు చేనేత కార్మికుడిగా జీవనం సాగిస్తున్నారు. ఇతని భార్య బుధవారం మధ్యాహ్నం ఇంటికి తాళం వేసుకుని పిల్లలకు భోజనం తీసుకెళ్లింది. ఈ సమయంలో గుర్తు తెలి యని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బంగారునగలు, వెండిసామగ్రిని దొంగిలించుకు వెళ్లారు. పిల్లలకు భోజనం పెట్టి ఇంటికి తిరిగివచ్చిన భార్య దొంగతనం జరిగి ఉండటాన్ని గుర్తించి భర్త నాగరాజుకు సమాచారం ఇచ్చింది. ఆయన ఫిర్యాదు మేరకు కేస దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సంబేపల్లె : ఆరుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ షరీఫ్ గురువారం తెలిపారు. మినమరెడ్డిగారిపల్లె సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని, రూ. 9800 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఒత్తిడిని అధిగమిస్తే విజయం సొంతం

గుర్రంకొండ: విద్యార్థులు పరీక్షల ఒత్తిడిని అధిగమిస్తే విజయం మీ సొంతం అవుతుందని రీడో సంస్థ ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య, సోషియల్ ఉపాధ్యాయులు త్రినాథ్ అన్నారు. గురువారం స్థానిక ఏపీ గురుకుల బాలికల పాఠశాలలో యువ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుకొంటున్న 270 మంది విద్యార్థినిలకు ఏపీకి సంబంధించి జిల్లాల పూర్తి వివరాలతో కూడిన అట్లాసులను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పరీక్షలకు ప్రణాళికా బద్దంగా సిద్ధమైతే సబ్జెక్టు విషయాలపై మంచి పట్టు సాధించవచ్చన్నారు. సోషియల్ సబ్జెక్టులో అట్లాసులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శోభారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అట్లాసు అందుకున్న విద్యార్థినులు

నగర పంచాయతీ ప్రజలకు శుభవార్త

- ఇంటిపన్నులు ఆన్‌లైన్
- పన్నులపై వడ్డీ కూడా తగ్గుతుంది
- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కృషి ఫలితం

బి.కొత్తకోట : మేం ఇంటి పన్నులు చెల్లించాం, అయినా పన్ను కంటే ఎక్కువ బిల్లు చెల్లించాలని మళ్లీ అధికారులు కోరుతున్నారు అని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డికి ప్రజల నుంచి పెద్దసంఖ్యలో వినతులు వచ్చాయి. ఈ వ్యవహారంలో ఏమి జరిగిందని ఆరా తీసిన ఎమ్మెల్యేకు .. గతంలో పనిచేసిన అధికారుల తప్పిదాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో ప్రజలపై పైసా అదనపు భారం పడకుండా ఇబ్బందులు తొలగించేందుకు ఎమ్మెల్యే సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఆఫ్‌లైన్‌లో చెల్లించిన ఇంటిపన్నులను ఆన్‌లైన్ చేసి సమస్యను పరిష్కరించాలని ఏడాదికాలంగా కృషి చేస్తున్నారు. ఈ కృషి ఫలించడంతో గురువారం నుంచి ఆఫ్‌లైన్ ఇంటిపన్నుల చెల్లింపు ఆన్‌లైన్ విధానానికి కమిషనర్ పలసాని నరసింహప్రసాద్ చర్యలు చేపట్టారు.



బి.కొత్తకోట నగర పంచాయతీ కార్యాలయం

జరిగింది ఇదీ..

బి.కొత్తకోట నగర పంచాయతీలో రూ.2.9 కోట్ల ఇంటి పన్నుల డిమాండ్ ఉంది. గత ఏడాదిలో ఇంటిపన్నులను వసూలు చేసి అధికారులు బిల్లులను ఆఫ్‌లైన్‌లో ఇచ్చి నగదు తీసుకున్నారు. దీనికి ఆన్‌లైన్ రశీదు ఇవ్వలేదు. బిల్లులు చెల్లించినట్లుగా రశీదులు లేవు. డిమాండ్ నోటీసులతోనే సరిపెట్టారు. దీనితో ప్రజలు ఎంత పన్ను చెల్లించారు, ఇంకా ఎంత చెల్లించాలి అన్న వివరాలను నమోదు చేయలేదు. ఫలితంగా ప్రజలు పన్నులు కట్టినా పెండింగ్‌లో ఉన్నట్టు చూపుతూ, దానికి వడ్డీ భారం కూడా పడింది. ఇది ప్రజల్లో ఆందోళనకు గురిచేసింది. ఈ సమస్యను చక్కదిద్దేందుకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కృషి చేశారు. మున్సిపల్ శాఖ ఉన్నతాధికారుల వద్దకు స్వయంగా వెళ్లి సమస్యను వివరించారు. దీనితో ప్రభుత్వం నుంచి సరిదిద్దేందుకు అనుమతి లభించింది.

రూ.1.2 కోట్ల భారం లేనట్టే

నగర పంచాయతీ ప్రజల నుంచి ఏటా రూ.2.9 కోట్ల ఇంటి పన్నులు వసూలు కావాలి. తాజాగా ఇంటిపన్నుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియకు శ్రీకారం చుట్టడంతో ఇంతవరకు పన్నులు చెల్లించిన వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. దీనితో ప్రజలపై పేరుకుపోయినట్టు పెండింగ్‌లో చూపిస్తున్న పన్నుల అప్పు తగ్గిపోతుంది. చెల్లించిన పన్ను వరకు భారం తగ్గడమే కాక దానిపై వేసిన వడ్డీ భారం రూ.30 లక్షల వరకు ఆదా అయి తగ్గుతుంది. చెల్లించిన డబ్బు, వడ్డీ భారం తప్పిస్తే ప్రజలపై రూ.1.2 కోట్లు అదనపు భారం తొలగించినట్టు అవుతుంది. ఈ ఆన్‌లైన్ ప్రక్రియను గురు, శుక్రవారాల్లో పూర్తి చేసి ప్రజలపై ఉన్న ఇబ్బందులను తొలగిస్తామని కమిషనర్ పలసాని నరసింహ ప్రసాద్ చెప్పారు. ఇక నుంచి ప్రతిఇంటి పన్ను ఆన్‌లైన్ అవుతుందని, పైసా చెల్లించినా ఆన్‌లైన్ రశీదు వస్తుందని చెప్పారు. ప్రజల నుంచి ఇంకా ఫిర్యాదులు వస్తే వాటిని పరిష్కరిస్తామని చెప్పారు.

సిండికేటా.. పోటాపోటీనా..?

నేడు వేలంపాటలు

బి.కొత్తకోట: బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలో గుత్తలకు శుక్రవారం వేలంపాటలను నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఈ పోటీలకు పాటదారులు సిండికేట్ అవుతారా లేక పోటాపోటీగా వేలంపాటల్లో పాల్గొంటారా అన్నది ఆసక్తిగా మారింది. పట్టణ పరిధిలోని వారపుసంత, ప్రయివేటు బస్టాండ్, దినసరి మార్కెట్‌కు 2020–21 ఆర్థిక సంవత్సరం వరకు గ్రామపంచాయతీనే వేలంపాటలను నిర్వహించింది. 2020 డిసెంబర్‌లో పంచాయతీ స్థాయి నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ అయ్యింది. కోవిడ్ కారణంగా 2021–22కు వేలంపాటలను నిర్వహించలేదు. 2022–23కు వేలంపాటలు నిర్వహించగా నిరాశజనకమైన ఆదాయం వచ్చింది. రూ.13.20లక్షల ఆదాయం లభించింది. వారపుసంతకు రూ.8.02 లక్షలు, దినసరి మార్కెట్‌కు రూ.1.06లక్షలు, ప్రయివేటు బస్టాండ్‌కు రూ.4.12 లక్షలు ఆదాయం వచ్చింది. ఈ వేలంపాటల ఆదాయం నగర పంచాయతీకి తిరోగమనంలో ఉన్నట్టు విమర్శలు వచ్చాయి. గ్రామపంచాయతీగా ఉన్నప్పుడు 2018–19లోనే వారపుసంతకు రూ.9.53లక్షలు, దినసరి మార్కెట్‌కు రూ.1,00,100, ప్రయివేటు బస్టాండ్‌కు రూ.4.25లక్షలు పలికింది. మొత్తం రూ.14.79లక్షల ఆదాయం లభించింది. దీన్నిబట్టి పరిశీలిస్తే శుక్రవారం జరిగే వేలంపాటల్లో అత్యధికంగా పాటలు జరగాల్సి ఉంది. ప్రస్తుత పరిస్థితులు, గేటు వసూళ్ల రుసుమును బట్టి పోటాపోటీగా వేలంపాటలు జరగాలి. ఆదాయం కూడా దీనికి రెట్టింపు కావాల్సివుంది. ఈ పరిస్థితుల్లో వేలంపాటలపై అందరూ దృష్టి సారించారు. అధికారుల అంచనా మేరకు వేలం ఆదాయం వస్తుందా లేదా, పాటలు ఆశాజనకంగా లేకుంటే వాయిదా వేస్తారా అన్నది చూడాలి.

ఘనంగా ద్రౌపది కల్యాణం

చిన్నమండెం : మండల పరిధిలోని కేశాపురం గ్రామం రెడ్డివారిపల్లె సత్రం వద్ద జరుగుతున్న మహాభారత మహోత్సవంలో భాగంగా గురువారం ద్రౌపది కల్యాణ కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. ప్రముఖ భాగవతారిణి శారదచే ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డిల ఆధ్వర్యంలో మహాభారత యజ్ఞం కొనసాగుతోంది. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పొలిమేర రెడ్డిసిద్దారెడ్డి, స్వాతి, సర్పంచ్ మంజుల, ఎంపీటీసీ రెడ్డప్ప, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.